


జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశం టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

| ఆదివారం 22 ఫిబ్రవరి 2026 | పేజీలు 04 | వెల రూ: 2/- | సంపుటి 01 ,సంచిక 265 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : కాసే అమృత |
|---|---|---|---|---|---|



## భూసేకరణ పనులు వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఫిబ్రవరి 22: సూర్యాపేట జిల్లాలో నిర్మించతలపెట్టిన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, టీజీ ఐఐసి, రైల్వే శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీర్లతో భూసేకరణ పనులపై వెబెక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇరిగేషన్ ప్రాజెక్టులు, రైల్వే ప్రాజెక్టులు, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పనులు మరియు ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన భూముల సేకరణలో పెండింగ్‌లో ఉన్న అంశాలను త్వరితగతిన పరిష్కరించి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి ప్రజా ప్రయోజన కార్యక్రమాలు ఆలస్యం కాకుండా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ్, సూపరింటెండెంట్ శ్రీలత తదితరులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయం ద్వారా ఈ ప్రకటన విడుదలైంది.

## హైదరాబాద్‌లో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రికి ఘన స్వాగతం



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 22: హైదరాబాద్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మరియు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. నగరానికి విచ్చేసిన కేంద్ర మంత్రిని పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించి రాష్ట్ర ప్రభుత్వ తరఫున శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అమలవుతున్న గ్రామీణాభివృద్ధి పథకాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ఉపాధి కార్యక్రమాల పురోగతిపై సమీక్ష జరగనుందని అధికారులు పేర్కొన్నారు. కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి మరింత చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు మార్గదర్శకాలు జారీ

సందేశం టైమ్స్, సూర్యాపేట, ఫిబ్రవరి 22: సూర్యాపేట జిల్లా పరిధిలోని ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలకు జిల్లా కలెక్టర్ (అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు) శాఖ ఆధ్వర్యంలో పలు మార్గదర్శకాలు జారీ చేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రైవేట్/కార్పొరేట్ పాఠశాలలు విద్యార్థుల నుండి అనవసర రుసుములు వసూలు చేయరాదని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో ఫీజు నిర్మాణాన్ని స్పష్టంగా ప్రదర్శించాల్సి ఉండగా, గరిష్టంగా ఐదు సంవత్సరాల కాలానికి 7 శాతం నుండి 10 శాతం వరకు మాత్రమే పెంపు అనుమతించబడుతుందని, అందులో 50 శాతం మేర మాత్రమే రుసుములు వసూలు చేయాలని సూచించారు. విద్యార్థులపై అదనపు ఆర్థిక భారం మోపకూడదని, పాఠశాలల్లో సీసీటీవీ కెమెరాలు, భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలని, ఒకే సెట్ యూనిఫామ్ మరియు పాఠ్యపుస్తకాలు (బ్యాగులు/నోట్‌బుక్స్ పై బలవంతం చేయరాదు) విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన విధానాలు అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ మార్గదర్శకాలను 25.03.2026 లోపు అమలు చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. జిల్లా పౌర సంబంధాల అధికారుల ద్వారా ఈ ప్రకటన విడుదలైంది.

## కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రికి హైదరాబాద్‌లో ఘన స్వాగతం




సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 22: హైదరాబాద్‌లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడానికి వచ్చిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కు రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మరియు ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు. నగరానికి చేరుకున్న కేంద్ర మంత్రిని పుష్పగుచ్ఛాలతో ఆహ్వానించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అమలవుతున్న గ్రామీణాభివృద్ధి పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, గ్రామీణ ఉపాధి కార్యక్రమాల పురోగతిపై చర్చించనున్నట్లు అధికారులు తెలిపారు. కేంద్ర-రాష్ట్ర సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి మరింత చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఫిబ్రవరి నెలాఖరు వరకు పత్తి కొనుగోళ్లు కొనసాగింపు మంత్రి తుమ్మల

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 22: రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లను ఫిబ్రవరి నెలాఖరు వరకు కొనసాగించాలని సీసీఐ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రి అభ్యర్థన మేరకు పత్తి కొనుగోళ్ల గడువును పొడిగించినట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో మంత్రి ఆదేశాలపై వ్యవసాయశాఖ కార్యదర్శి కేంద్ర జౌళిశాఖ జాయింట్ సెక్రటరీకి లేఖ రాసి గడువు పొడిగింపును కోరగా, ఇప్పటికే కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి గారిని కూడా సంప్రదించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మరియు సీసీఐ తీసుకున్న నిర్ణయంపై మంత్రి తుమ్మల సంతోషం వ్యక్తం చేస్తూ, పొడిగించిన గడువును వినియోగించుకొని రైతులు తమ పత్తిని విక్రయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు కొనసాగుతాయని అధికారులు తెలిపారు.



## జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ మీడియా అకాడమి కట్టుబడి ఉంది: చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 22: జర్నలిస్టుల సంక్షేమానికి తెలంగాణ మీడియా అకాడమి కట్టుబడి ఉందని అకాడమి చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం అకాడమి కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన రెండవ పాలకమండలి సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణలోని 8 జిల్లాలకు చెందిన జర్నలిస్టులకు శిక్షణా కార్యక్రమాలు, వివిధ అంశాలపై 7 వర్క్‌షాప్‌లు నిర్వహించడంతో పాటు 12 మంది సీనియర్ జర్నలిస్టుల జీవితాలపై మోనోగ్రాఫ్‌లు ముద్రించినట్లు తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమంలో భాగంగా విడతల వారీగా 120 మంది మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 లక్ష ఆర్థిక సహాయం, 5 సంవత్సరాల పాటు నెలకు రూ.3 వేల పెన్షన్ సదుపాయం కల్పించినట్లు వివరించారు. అదేవిధంగా అనారోగ్యం, ప్రమాదాలకు గురైన 19 మంది జర్నలిస్టులకు ఆర్థిక సహాయం అందించినట్లు చెప్పారు. అకాడమి భవన నిర్వహణలో భాగంగా 250 సీటింగ్ కెపాసిటీ గల ఆడిటోరియంను అద్దెకు ఇవ్వాలన్న ప్రతిపాదనకు గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ విధానాన్ని పూర్తిగా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ ద్వారా పారదర్శకంగా అమలు చేయాలని సభ్యులు సూచించగా, ప్రభుత్వ ఆధీనంలోని రవీంద్రభారతి, జె.ఎన్.టి.యూ. మరియు సురవరం ప్రతాపరెడ్డి విశ్వవిద్యాలయం విధి విధానాలను అధ్యయనం చేసి అద్దె నిబంధనలు రూపొందించాలని అకాడమి కార్యదర్శికి సూచించారు. సమావేశంలో సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక, ఉస్మానియా యూనివర్సిటీ జర్నలిజం విభాగాధిపతి డా. సతీష్ కుమార్ తల్లాడి, డా. బి.ఆర్. అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ ఇంచార్జి డా. సునిల్ కుమార్ పోతన, దూరదర్శన్ కేంద్ర ప్రతినిధి ఎ. చాందిని, ఆల్ ఇండియా రేడియో అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్. రమేష్ సుంకసారి, వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయం ప్రతినిధులు, అకాడమి కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. జారీ చేసినవారు: కార్యదర్శి, తెలంగాణ మీడియా అకాడమి, హైదరాబాద్.



## యథావిధిగా ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి, ఫిబ్రవరి 22: మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తాత్కాలికంగా నిలిపివేసిన ప్రజావాణి కార్యక్రమాన్ని ఫిబ్రవరి 23వ తేదీ (సోమవారం) నుండి యథావిధిగా నిర్వహించనున్నట్లు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన వినతులు స్వీకరించి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు.



## రేపటితో ముగియనున్న పోటీ పరీక్షల ఉచిత శిక్షణ దరఖాస్తుల స్వీకరణ జిల్లా ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్ రెడ్డి

సంగారెడ్డి, ఫిబ్రవరి 22: టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ లో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, గ్రూప్-4, ఆర్‌ఆర్‌బి, ఎస్ఐ, కానిస్టేబుల్, ఎస్ఎస్‌సి తదితర పోటీ పరీక్షల కోసం నిర్వహించే ఉచిత శిక్షణకు ఈ నెల 22వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ డిప్యూటీ డైరెక్టర్ అధికారి అఖిలేష్ రెడ్డి తెలిపారు.టీజీ ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్‌తో కలిసి విడుదల చేసిన ప్రకటనలో, పోటీ పరీక్షలకు 5 నెలల ఫౌండేషన్ కోర్సు ద్వారా ఉచితంగా శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.డిగ్రీ పూర్తి చేసి, వార్షిక ఆదాయం రూ. 3 లక్షల లోపు ఉన్న ఎస్సీ, బీసీ, ఎస్టీ అభ్యర్థులు ఆన్లైన్‌లో tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 1న స్థానిక ప్రతిభ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. మెరిట్ ఆధారంగా 100 మంది అభ్యర్థులను ఎంపిక చేసి, 5 నెలల పాటు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.వివరాలకు 91822 20112 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని అధికారులు కోరారు.

## 10వ తరగతి వార్షిక పరీక్షలకు సమగ్ర ఏర్పాట్లు కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మార్గనిర్దేశం

సూర్యాపేట, ఫిబ్రవరి 22:.10వ తరగతి వార్షిక పరీక్షలను సక్రమంగా, పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులతో సమగ్ర అవగాహన ఒరియంటేషన్ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ నిర్వహించారు.కలెక్టరేట్ సమీక్ష సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ప్రశ్నాపత్రాల భద్రత, రవాణా, సీలింగ్–అన్‌సీలింగ్ విధానం, పరీక్షా కేంద్రాల్లో పర్యవేక్షణ, ఫ్లయింగ్ స్క్వాడ్ల సమన్వయం వంటి అంశాల్లో కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.పరీక్షలు ఎటువంటి అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.జిల్లాలో మొత్తం 12,403 మంది విద్యార్థులు 69 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ప్రతి కేంద్రంలో తాగునీరు, విద్యుత్, శుచిమందిరాలు, ఫర్నిచర్, ఫస్ట్ ఎయిడ్ వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల కోసం స్క్రైబ్ సౌకర్యం, అవసరమైన చోట వీల్‌చైర్లు అందుబాటులో ఉంచినట్లు వెల్లడించారు.పరీక్షలను నిబంధనల ప్రకారం, ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు అందించినట్లు కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, అసిస్టెంట్ కమిషనర్ (ప్రభుత్వ పరీక్ష విభాగం) సీనయ్య, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఆస్వస్థతకు గురైన KGBV విద్యార్థులను పరామర్శించిన నాయకులు



సంగారెడ్డి, ఫిబ్రవరి 22 – సందేశం టైమ్స్, అందోల్ నియోజకవర్గం, మండలం రేగోడులోని KGBV Schoolలో ఆస్వస్థతకు గురైన విద్యార్థులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పరిశీలించారు. ఈ ఘటన చాలా బాధాకరంగా ఉందని నాయకులు పేర్కొన్నారు. ఉన్నత అధికారులు వెంటనే విచారణ చేపట్టి, ఇలాంటివి మరల జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు.విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి కూర్చి స్థానికంగా లేని శ్యామ్ రావు కులకర్ణి ఉపాధ్యాయులతో మాట్లాడి, పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పిల్లలు, ఉపాధ్యాయులు ఆరోగ్యవంతమైన వాతావరణంలో ఉండేలా చూడాలని నాయకులు సూచించారు. ఏమైనా అవసరమైతే వారు అన్ని విధాల అండగా ఉంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు: మాజీ సర్పంచ్ కుమ్మరి నారాయణ, Ex MPTC రామాగౌడ్, సీనియర్ నాయకులు పెద్దిరప్ప సంగప్ప, 10వ వార్డ్ మెంబర్ దత్తు, Ex వార్డు మెంబర్ అంజా గౌడ్, ఎల్రాజ్ గౌడ్, గ్రామ నాయకులు బోయి సతీష్ చాంద్ పాషా, సాగర్ రెడ్డి, నగదర రాము తదితరులు.

## మైనారిటీ నిరుద్యోగ యువతకు భారీ సబ్సిడీతో ఈ-స్కూటర్లు – దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి, ఫిబ్రవరి 22 – సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్: తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్ కింద, మైనారిటీ నిరుద్యోగ యువకులకు (ముస్లిం, సిక్కు, బౌద్ధ, జైన, పార్సీ) స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టును ప్రారంభించింది అని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి జి. అంబాదాస్ రాజేశ్వర్ తెలిపారు.ఈ పథకం కింద ఎంపికైన అర్హులకు రూ. 1,50,000 విలువైన ఈ-స్కూటర్ అందజేయబడుతుందని, ఇందులో 80% (రూ. 1,20,000) కార్పొరేషన్ ద్వారా సబ్సిడీగా మంజూరు చేయబడతుందని, అభ్యర్థి కేవలం 20% (రూ. 30,000) మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని ఆయన వివరించారు.దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు మైనారిటీ వర్గానికి చెందినవారు, 21 నుండి 40 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలి, కనీసం 10వ తరగతి ఉత్తీర్ణతతో పాటు ఆర్‌టిఏ జారీ చేసిన డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ. 1,50,000 లోపు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2,00,000 లోపు ఉండాలి. గత 5 ఏళ్లలో కార్పొరేషన్ పథకాల ప్రయోజనం పొందని వారు మాత్రమే అర్హులు.ఆసక్తి గల అభ్యర్థులు మార్చి 1, 2026 లోపు పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం దరఖాస్తు కాపీతో పాటు ఆధార్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు మరియు పదో తరగతి సర్టిఫికేట్లను సంబంధిత ఎంపీడీఓ లేదా మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో సమర్పించాలని ఆయన సూచించారు.

## ఆందోల్ నియోజకవర్గంలో మహిళలకు ఉపాధి అవకాశాల కోసం పరిశ్రమల ఏర్పాటు





సంగారెడ్డి, ఫిబ్రవరి 22 – సందేశం టైమ్స్ ప్రతినిధి బి. రమేష్ బాబు: సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం, పోసానిపేట్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన RRD డిస్టలరీని మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్, హెల్త్ హబ్గా తీర్చిదిద్దామని, సింగూర్ ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలో 40,000 ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు, మరో లక్ష ఎకరాలకు సాగునీరు అందించడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు.మరియు, నిరుద్యోగులకు, మహిళలకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలను కల్పించడమే లక్ష్యంగా పరిశ్రమల ఏర్పాటు కోసం కృషి చేస్తున్నామని తెలిపారు. RRD డిస్టలరీ యాజమాన్యాన్ని అభినందించి, పరిశ్రమలోని అన్ని విభాగాలను పరిశీలించారు. పరిశ్రమ ద్వారా పరిసర ప్రాంతాల ప్రజలకు ఉద్యోగ అవకాశాలు కల్పించడాన్ని మంత్రి స్వాగతించారు.మాజీ ఉద్యోగులు, నేతలతో పాటు ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు:ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి పేర్ని నాని, ఎమ్మెల్సీ భాను ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు, RRD డిస్టలరీ MD కొండల నిపుణ్ రెడ్డి, కంపెనీ డైరెక్టర్ త్రిష, మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రామ్ రెడ్డి, బండ అభిలాష్ రెడ్డి, తీగల నర్సిరెడ్డి, సుధాకర్ రెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు, ఆందోల్–జోగిపేట మున్సిపాలిటీ నుండి పలువురు కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు.మంత్రిత్వ శాఖ పేర్కొన్నది ప్రకారం, ఈ పరిశ్రమ మరింత విస్తరించి రాబోయే రోజుల్లో మరో 500 మందికి ఉపాధి అవకాశాలను కల్పించేందుకు దోహదపడాలని ఆశిస్తున్నారు. నియోజకవర్గంలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే కంపెనీలకు ప్రోత్సాహం అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి తెలిపారు.

## ఓటమిని అంగీకరించినా సేవలోనే ఉంటాను: ఎదురుగట్ల చిట్టిమల్లు లక్ష్మి



సూర్యాపేట సందేశం టైమ్స్, ఖమ్మం, ఫిబ్రవరి 22: ఖమ్మం జిల్లా ఎదులాపురం మున్సిపాలిటీ, సత్యనారాయణపురం మున్సిపాలిటీ 23వ వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయిన ఎదురుగట్ల చిట్టిమల్లు లక్ష్మి ఓటమిని బాధతో అంగీకరిస్తున్నానని తెలిపారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, ప్రజల తీర్పును గౌరవిస్తున్నానని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల్లో తనకు మద్దతు తెలిపిన ప్రతి ఓటరికి కృతజ్ఞతలు తెలుపుతూ, ఓడినా గెలిచినా సత్యనారాయణపురం 23వ వార్డు ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని మాటిచ్చారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటానని, వార్డు అభివృద్ధి, మౌలిక వసతుల మెరుగుదల, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజలతో కలిసి ముందుకు సాగుతానని తెలిపారు. ఎన్నికల ఫలితాలతో తన సేవా భావం తగ్గదని, ప్రజల విశ్వాసం పొందే వరకు కృషి కొనసాగిస్తానని ఈసందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

# పత్తి రైతులకు ఊరట: సిసిఐ కొనుగోలు గడువు ఫిబ్రవరి 27 వరకు పొడిగింపు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి శెట్టి వెంకటేష్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుత 2025-26 పత్తి సీజన్‌కు సంబంధించి పత్తి కొనుగోలు గడువును పెంచుతూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (CCI) ద్వారా జరుగుతున్న ఈ కొనుగోళ్ల ప్రక్రియ వాస్తవానికి ఫిబ్రవరి 20, 2026తో ముగియాల్సి ఉండగా, రాష్ట్ర ప్రభుత్వ విన్నపాన్ని పరిగణనలోకి తీసుకున్న సిసిఐ సంస్థ ఈ గడువును ఫిబ్రవరి 27, 2026 వరకు పొడిగించినట్లు వివరించింది. కాబట్టి రాష్ట్రంలోని పత్తి రైతులందరూ ఈ పొడిగించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని, గడువు తేదీ లోపు తమ పత్తిని సంబంధిత సిసిఐ కొనుగోలు కేంద్రాలలో విక్రయించుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు. గడువు ముగిసేలోపు విక్రయ ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా ఎటువంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ మేరకు రైతులు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు.



# రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాంగ్రెస్ కార్యకర్త యూసుఫ్ కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి దామోదర్ రాజనర్సింహ

ఆందోల్, ఫిబ్రవరి 22 – సందేశం టైమ్స్ సంగారెడ్డి జిల్లా ప్రతినిధి టీ. సంగమేశ్వర్:.ఆందోల్ నియోజకవర్గంలోని జోగిపేట మున్సిపాలిటీ 15వ వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త యూసుఫ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందగా, ఈ విషయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ కుటుంబాన్ని పరామర్శించారు.మంత్రి యూసుఫ్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చగా, యూసుఫ్ సోదరుడు జీషాన్‌తో మాట్లాడి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. కుటుంబానికి ప్రభుత్వం మరియు పార్టీ తరఫున పూర్తి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మరియు పార్టీ కార్యకర్తలు కూడా పాల్గొన్నారు.

# జహీరాబాద్‌లో ఎరుకల సంఘం ఆధ్వర్యంలో కౌన్సిలర్ల ఘన సన్మానం



జహీరాబాద్, ఫిబ్రవరి 22, 2026, జహీరాబాద్ నియోజకవర్గంలో ఎరుకల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధులకు ఘన సన్మాన కార్యక్రమం పచ్చ తోరణం హోటల్‌లో నిర్వహించారు. కోహిర్ మున్సిపాలిటీ చైర్మన్ అశోక్ గారితో పాటు కౌన్సిలర్లు జాజుల శ్రీకాంత్ (3వ వార్డు, కోహిర్) మరియు నర్సింలు (2వ వార్డు, సదాశివపేట్) సంఘ నాయకులు, కుల పెద్దలు, బంధుమిత్రులచే శాలువాలతో సత్కరించబడ్డారు. చైర్మన్ అశోక్ ఎరుకల కులస్తులకు అన్ని విధాలుగా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కౌన్సిలర్లు జాజుల శ్రీకాంత్, నర్సింలు ఎరుకల సమాజం రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర సంఘ నాయకుడు కెంపుల రాజు, మాజీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు నిమ్మల కిష్టయ్య ప్రతి ఎరుకల కులస్తుడు రాజకీయ, వ్యాపార, ఉద్యోగ రంగాల్లో ముందుకు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, నాయకులు, కుల పెద్దలు, పెద్ద సంఖ్యలో కులస్తులు పాల్గొని ఘనంగా జరిపించారు.

# గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి సర్పంచులు అంకితభావంతో కృషి చేయాలి: కలెక్టర్ పి. ప్రావీణ్య





సంగారెడ్డి, ఫిబ్రవరి 22, 2026, పల్లెల సర్వతోముఖాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సర్పంచులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మహిళా ప్రాంగణంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల కోసం నిర్వహించిన ఐదు రోజుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా శనివారం ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని సర్పంచులను ఉద్దేశించి ప్రసంగించారు. కలెక్టర్ మాట్లాడుతూ, శిక్షణలో పొందిన అవగాహనను గ్రామాల అభివృద్ధికి సమర్థవంతంగా వినియోగించుకోవాలని, ప్రజలకు పారదర్శక, సమర్థవంతమైన పాలన అందించడం సర్పంచుల ప్రధాన బాధ్యత అని అన్నారు. నిధులు, విధులను సక్రమంగా వినియోగిస్తూ అన్ని వర్గాల సమన్వయంతో గ్రామాల సమగ్రాభివృద్ధి సాధించాలని, ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజల అవసరాలను వెంటనే గుర్తించి స్పందించాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో మమేకమై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని హితవు పలికారు. గ్రామ పంచాయతీలను ఆదర్శవంతమైన స్థానిక సంస్థలుగా తీర్చిదిద్దేందుకు సర్పంచులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకుని, పారదర్శకతతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో మరియు ఇన్‌చార్జ్ జిల్లా పంచాయతీ అధికారి జానకి రెడ్డి, డీఎల్పీవోలు, ఎంపీడీవోలు, మాస్టర్ ట్రైనర్లు మరియు వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

# తన కుమారుడి మరణంపై తండ్రి అనుమానం ఐదుగురిపై ఫిర్యాదు



సందేశం టైమ్స్, ప్రతినిధి శెట్టి వెంకటేష్: సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయులసింగవరం గ్రామానికి చెందిన వేముల వెంకన్న తన కుమారుడు వేముల రాము (28) మరణంపై తీవ్ర అనుమానాలు వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం, రాముకు 2019లో వివాహమై ఇద్దరు కుమారులు ఉన్నారు. గత ఆరు నెలల క్రితం కుటుంబ సమస్యల కారణంగా రాము తన భార్య స్వగ్రామమైన కొమరారం గ్రామానికి వెళ్లి అక్కడ నివాసం ఉంటున్నాడు. అయితే, ఈ నెల 19వ తేదీన రాము ఇంటి నుండి వెళ్లిపోయాడని, అదే రోజు రాత్రి తిరిగి వచ్చాడని బంధువులు తెలిపారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, ఫిబ్రవరి 20వ తేదీ మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో రాము చనిపోయాడనే సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఇల్లందు ఏరియా ఆసుపత్రికి చేరుకున్నారు. అక్కడ తన కుమారుడి మృతదేహాన్ని పరిశీలించిన తండ్రి వెంకన్న, తన కుమారుడిని ఎవరో గొంతు నులిమి హత్య చేసినట్లుగా ఆనవాళ్లు ఉన్నాయని ఆరోపించారు. ఈ క్రమంలో రాము భార్య వేముల మౌనికతో పాటు గుండగాని యాకయ్య, స్వాతి, గోపగాని వెంకటేష్, సిరి అనే ఐదుగురు వ్యక్తులు కలిసి తన కుమారుడిని హత్య చేశారని ఆయన తన ఫిర్యాదులో అనుమానం వ్యక్తం చేశారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని వేముల వెంకన్న కోరారు.



# ఔదత్‌పూర్ జాతర మహోత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి

సందేశం టైమ్స్, నాగల్ గిద్దా మండలం, ఫిబ్రవరి 22: సంగారెడ్డి జిల్లా నాగల్ గిద్దా మండలం ఔదత్‌పూర్ గ్రామంలో శ్రీ మచ్చేందర్ నాథ్ మహారాజ్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్న జాతర మహోత్సవాల చివరి రోజు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామ పెద్దల ఆహ్వానం మేరకు హాజరైన ఆయన స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. జాతర నిర్వహణలో అంకితభావంతో కృషి చేసిన నిర్వాహకులను అభినందిస్తూ గ్రామ అభివృద్ధికి అందరూ ఐక్యంగా పనిచేయాలని సూచించారు. అనంతరం అదే గ్రామానికి చెందిన మచ్చేందర్ గారు నూతనంగా నిర్మించిన గృహానికి జరిగిన గృహప్రవేశ కార్యక్రమానికి హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మణ్ నాయక్, మాజీ సర్పంచులు రాజ్ కుమార్, అశోక్ నాయక్, నాయకులు శ్రీధర్ పటేల్, బసవరాజ్, అజయ్ పటేల్, విజయ్ కుమార్ పటేల్, గునుగున్ పటేల్, రమేష్ పటేల్, చింటూ నరేష్ తదితరులు, భక్తులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# శ్రీహరి సర్వేశ్వర గోసేవా సదన్ గోశాలకు గోమాత దానం

సందేశం టైమ్స్ ,వట్పల్లి, ఫిబ్రవరి 22: సంగారెడ్డి జిల్లా కల్హేరు మండలంలోని రాపర్తి గ్రామానికి చెందిన పద్మశాలి సాలే సాయిలు మల్లేశ్వరి సేవాభావంతో గోమాతను దానం చేసి ఆదర్శంగా నిలిచారు. ఆమె శ్రీహరి సర్వేశ్వర గోసేవా సదన్ గోశాలకు గోమాతను సమర్పించి ధార్మిక, సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం అందించారు. గోమాత దానం చేయడం ద్వారా గోసంరక్షణకు ప్రోత్సాహం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ సామాజిక సేవలో భాగస్వాములు కావాలని ఆమె ఆకాంక్షించారు. గోశాల నిర్వాహకులు దాతను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గోసేవా ప్రాధాన్యతను వివరించి, గోసంరక్షణలో సమాజం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు మరియు స్థానికులు పాల్గొన్నారు.




# తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ సమావేశం విద్యుత్ సంస్థల నియామకాలపై విచారణకు నిర్ణయం

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 22: రాష్ట్ర బీసీ కమిషన్ సమావేశం ఈరోజు మధ్యాహ్నం 3.00 గంటలకు ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో ఛైర్మన్ జి. నిరంజన్ అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మి మరియు కమిషన్ మెంబర్ సెక్రటరీ శ్రీమతి బాల మాయ దేవి, ఐఏఎస్ పాల్గొన్నారు. అధికారులు డిప్యూటీ డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, సెక్షన్ ఆఫీసర్ జి. సతీష్ కుమార్ కూడా హాజరయ్యారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థలైన ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్ మరియు ఎస్‌పీడీసీఎల్ నియామకాలలో రిజర్వేషన్ల ఉల్లంఘన జరుగుతుందని తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంఘం ప్రస్తావించిన అంశంపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ నేపథ్యంలో మార్చి నాలుగో వారంలో విద్యుత్ సంస్థల కార్యాలయాలను సందర్శించి ప్రత్యక్ష విచారణ చేపట్టాలని కమిషన్ నిర్ణయించింది. అదేవిధంగా రాష్ట్రంలోని విద్యార్థుల వివరాల సేకరణను వేగవంతం చేయాలని అధికారులకు సూచనలు జారీ చేశారు

# బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభించిన మాద్రి పృథ్వీరాజ్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఫిబ్రవరి 22: పటాన్ చెరువు పట్టణంలోని జేపీ కాలనీ జిహెచ్ఎంసి డివిజన్ పరిధిలోని స్వామి వివేకానంద ఇండోర్ స్టేడియంలో 21వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ ఘనంగా ప్రారంభించారు. క్రీడా అభివృద్ధికి ఎప్పుడూ ముందుండే ఆయన ఈ కార్యక్రమానికి ఆర్థిక సహకారం అందించడంతో పాటు కాసేపు ఆటలో పాల్గొని యువతకు స్ఫూర్తినిచ్చారు. క్రీడలు యువతలో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొంటూ ఇలాంటి క్రీడా కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి స్థానిక క్రీడాకారులు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై టోర్నమెంట్‌ను విజయవంతం చేశారు.




# జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డుల జారీ – ప్రత్యేక కమిషనర్ సి.హెచ్. ప్రియాంక

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 22:తెలంగాణ రాష్ట్ర సమాచార & ప్రజా సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ శ్రీమతి సి.హెచ్. ప్రియాంక రాష్ట్ర ప్రభుత్వ జి.ఓ. ఎం.ఎస్. నం. 252 ప్రకారం రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులకు మీడియా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుండి ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, ఫ్రీలాన్స్ మరియు అనుభవజ్ఞులైన జర్నలిస్టులు ప్రత్యేక పోర్టల్ ipr.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తు స్వీకరణ మరియు కార్డుల జారీ ప్రక్రియ రోలింగ్ ప్రాతిపదికన కొనసాగుతుందని తెలిపారు. దరఖాస్తు చేసుకునే సమయంలో ఏవైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే, అభ్యర్థులు కార్యాలయ వేళల్లో ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు 9154170881 నంబర్‌లో మీడియా రిలేషన్స్ వింగ్‌ను సంప్రదించాలని సూచించారు.



# "సోషల్ మీడియా యాంటీ సోషల్‌గా మారింది" ఎం. వెంకయ్య నాయుడు విమర్శ

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఫిబ్రవరి 22: మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు సోషల్ మీడియా వినియోగంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సోషల్ మీడియా యాంటీ సోషల్ మీడియాగా మారిపోయిందని ఆయన వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో పెట్టే హెడ్డింగ్‌కు, లోపల ఉండే విషయానికి సంబంధం లేకుండా ప్రచారం జరుగుతోందని పేర్కొన్నారు. రాజకీయ నాయకులు సోషల్ మీడియాలో చేరి అసహ్యకరమైన భాషలో మాట్లాడుతున్నారని విమర్శించారు. వారి వ్యాఖ్యలను చూస్తే సభ్య సమాజం తలదించుకునే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. చట్టసభల్లో, బహిరంగ సభల్లో, టీవీ చర్చల్లో ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదని, ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. బూతులు మాట్లాడేవారికి బూత్‌లోనే సమాధానం చెప్పాలని తాను ముందే సూచించానని గుర్తుచేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో అసభ్య భాష ఉపయోగించిన వారు గెలవలేదని కూడా ఆయన వ్యాఖ్యానించారు.




# దేశవ్యాప్తంగా 32 నకిలీ విశ్వవిద్యాలయాలు గుర్తింపు (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) హెచ్చరిక

సందేశం టైమ్స్, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 22: దేశవ్యాప్తంగా మొత్తం 32 నకిలీ విశ్వవిద్యాలయాలను గుర్తించినట్లు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ వెల్లడించింది. ఇందులో అత్యధికంగా ఢిల్లీలోనే 12 నకిలీ విశ్వవిద్యాలయాలు ఉన్నట్లు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా రెండు నకిలీ విశ్వవిద్యాలయాలు పనిచేస్తున్నట్లు గుర్తించినట్లు సమాచారం. ఈ నకిలీ విశ్వవిద్యాలయాలు జారీ చేసే డిగ్రీలు, సర్టిఫికెట్లు చెల్లవని యూజీసీ స్పష్టం చేసింది. యూజీసీ చట్టం ప్రకారం అనుమతి లేకుండా విశ్వవిద్యాలయాల పేరుతో విద్యా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఏ యూనివర్సిటీలోనైనా చేరే ముందు సంబంధిత సంస్థకు యూజీసీ గుర్తింపు ఉందో లేదో అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించింది. నకిలీ విద్యాసంస్థల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కమిషన్ పిలుపునిచ్చింది.

# అడిలైడ్‌లో చారిత్రక విజయం.. ఆస్ట్రేలియాపై భారత్ మహిళల సంచలనం






సందేశం టైమ్స్, అడిలైడ్, ఫిబ్రవరి 22: అడిలైడ్ వేదికగా జరిగిన ట్వంటీ–20 క్రికెట్ పోటీలో భారత మహిళా జాతీయ క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శనతో ఆస్ట్రేలియా మహిళా జాతీయ క్రికెట్ జట్టుపై 17 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి ట్వంటీ–20 శ్రేణిని కైవసం చేసుకుని చరిత్ర సృష్టించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 176 పరుగులు చేసింది. ఆరంభ ఆటగాళ్లు దూకుడుగా ఆడగా, మధ్య వరుస క్రీడాకారిణులు సమయోచితంగా పరుగులు జోడించి చివర్లో వేగంగా పరుగులు సాధించి పోటీకి మంచి లక్ష్యాన్ని నిర్ధేశించారు. లక్ష్య ఛేదనకు దిగిన ఆస్ట్రేలియా జట్టు భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు కుదేలైంది. కీలక దశల్లో వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 9 వికెట్లకు 159 పరుగులకే పరిమితమైంది. దీంతో మూడు మ్యాచ్‌ల శ్రేణిని భారత్ 2–1 తేడాతో గెలుచుకుని ఆస్ట్రేలియా నేలపై తొలిసారి ట్వంటీ–20 శ్రేణి విజయం సాధించడం భారత మహిళా కికెట్ చరితలో మెలురాయిగా నిలిచింది.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.